క్లుప్తంగా

అ'పూర్వ' సమ్మేళనం



అలనాటి గురువులతో పూర్వ విద్యార్థులు

కారేపల్లి: పేరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006–07వ సంవత్సరం పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలు నెమరవేసుకుంటూ ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను ఘనంగా సన్మానించారు.

బీమా చెక్కు అందజేత

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన 108 పైలట్ బెజవాడ కృష్ణ గత సంవత్సరం అనారోగ్యంతో మృతి చెందగా కుటుంబానికి బుధవారం రూ.5 లక్షల బీమా చెక్కును అందజేశారు. జీవీకే ఈఎంఆర్ఐ కంపెనీ యాజమాన్యం ఈఎంఈ దుర్గా ఆధ్వర్యంలో కుటుంబానికి అందజేశారు.

ఎల్ఈడీ బల్బులు వితరణ



బల్బులను అందజేస్తున్న భాగం రాకేష్

బోనకల్: భాగం సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని ఆళ్లపాడు గ్రామానికి ప్రజల విజ్ఞప్తి మేరకు 5ఎల్ఈడీ బల్బులను భాగం రాకేష్ వితరణగా అందజేశారు. గతంలో కూడా గోవిందాపురం, ఆళ్లపాడు గ్రామాలకు ఎల్ఈడీ బల్బులను వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మందా లక్ష్మయ్య, మర్రి అప్పయ్య, మరీదు సైదులు, గుడిద రామారావు, మందా గోపి, మందా అశోక్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్‌కు కుర్చీలు..



కుర్చీలను అందజేస్తున్న వీరారెడ్డి, తిరుపతి రెడ్డి

చింతకాని: తహసీల్ కార్యాలయానికి మండలంలోని పందిళ్లపల్లి గ్రామానికి చెందిన వాకా వీరారెడ్డి, చల్లా తిరుపతి రెడ్డి బుధవారం కుర్చీలను అందజేశారు. ఈ సందర్భంగా దాతలను తహసీల్దార్ అనంతరాజు, కార్యాలయ అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వీరభద్రనాయక్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రఘు, జయకృష్ణ, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సామ్రాట్‌కు నివాళి

ముదిగొండ: మండలపరిధిలోని గోకినేపల్లిలో కొమ్మినేని సామ్రాట్ 12వ వర్ధంతి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. సామ్రాట్ స్మారక స్తూపం వద్ద రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ నాగేశ్వరరావు, కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు, మాజీ జెడ్పీటీసీ దేవేంద్రం, నాయకులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ సేవలు వినియోగించుకోవాలి

చింతకాని: పాక్షిక పక్షవాతం, శారీరక అంగవైకల్యం కలిగిన పిల్లల కోసం నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని వైద్యురాలు వల్లూరి వసంత తెలిపారు. బుధవారం మండలంలోని లచ్చగూడెం ఉన్నత పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో దివ్యాంగ పిల్లలకు వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో ఐఈఆర్పీలు కేఎస్ కృష్ణారావు, దస్లీ, అంగన్‌వాడీ టీచర్ రమాదేవి, భవిత కేంద్రం సంరక్షురాలు లలిత కుమారి, తదితరులు పాల్గొన్నారు.

పండుగ వేళ రద్దీ..



ప్రయాణికులతో కిక్కిరిసిన ఆర్టీసీ బస్సు

కొణిజర్ల: దసరా పండుగ పురస్కరించుకుని ఆర్టీసీకి బాగా కలిసి వస్తుంది. ఆర్డనరీ, ఎక్స్‌ప్రెస్ అని లేకుండా ఏ బస్సు చూసినా కిక్కిరిస్తుంది. పండుగ సెలవులు రావడంతో ప్రతి ఒక్కరూ కుటుంబాలతో కలిసి విహార యాత్రలకు, మహిళలు అమ్మగారి ఇళ్లకు పోతుండటంతో బస్సులు నిండిపోతున్నాయి. మరో వైపు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కావడంతో చిన్న వస్తువులు కొనాలన్నా బస్సెక్కి ఖమ్మం వస్తున్నారు. దీనికి తోడు హైదరాబాద్ సర్వీసులు పెంచడంతో గ్రామాలకు బస్సు సర్వీసులు తగ్గిపోయాయి. అందువల్ల గంటల తరబడి బస్సుల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితులు వస్తున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు.

ముగిసిన డిజిటల్ కార్డుల సర్వే

మొదలైన ఆన్‌లైన్ ప్రక్రియ



సర్వేను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)



మున్సిపాలిటీలో ఆన్‌లైన్ చేస్తున్న మున్సిపల్ ఉద్యోగులు

సత్తుపల్లిటౌన్: కుటుంబ డిజిటల్‌కార్డుల జారీ కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వే ప్రక్రియ ముగిసింది. ఇక సిబ్బంది ఆన్‌లైన్ చేసే పనిలో నిమగ్నమయ్యారు. పైలెట్ ప్రాజెక్టుగా సత్తుపల్లి మున్సిపాలిటీలోని 22వ వార్డు, మధిర మున్సిపాలిటీలోని 17వ వార్డు, వైరా మున్సిపాల్టీలోని 14వ వార్డులలో ఈ నెల 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ప్రత్యేక బృందాలు సర్వే నిర్వహించాయి. ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్ సంఖ్య, పుట్టిన తేదీలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫొటోలు తీసుకున్నారు.

రేషన్‌కార్డుల కోసం..

ప్రస్తుతం ఒక ఇంట్లో ఒక రేషన్‌కార్డు ఉంది. ఇంటి యజమాని పిల్లలకు పెళ్లిళ్లు జరిగి కుటుంబాలు విడివిడిగా ఏర్పడ్డాయి. వారికి ఇప్పటి వరకు రేషన్ కార్డు లేదు. చాలా మంది రేషన్‌కార్డు కోసం పేర్లు నమోదు చేయించారు. దీంతో కుటుంబాల సంఖ్య పెరిగింది.

మున్సిపాలిటీ	వార్డులు	గృహాలు	కుటుంబసభ్యులు
సత్తుపల్లి	22	320	875
మధిర	17	388	1245
వైరా	14	692	1905

కంప్యూటరీకరణ: డిజిటల్‌కార్డు కోసం చేపట్టిన సర్వే ఫారంలో కుటుంబ సభ్యుల సమాచారం, కుటుంబ సభ్యుల గ్రూప్ ఫొటోలను ప్రత్యేకంగా రూపొందించిన మీసేవా పోర్టల్‌లో మున్సిపల్ సిబ్బంది ఆన్‌లైన్ చేయటంలో నిమగ్నమయ్యారు. అయితే ఫొటోలు సెల్‌ఫోన్లతో తీయటం వల్ల వాటి సైజు ఎక్కువగా ఉండటంతో అప్‌లోడ్ చేసేందుకు ఒక్కో దరఖాస్తుకు ఐదు నుంచి పది నిమిషాల సమయం పడుతుంది. దీంతో రోజుకు ఒక్కొక్కరు 20 నుంచి 30 దరఖాస్తులు ఆన్‌లైన్ చేయటం గగనంగా మారింది. సర్వే ఫార్మెట్‌లో సేకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసేపని చేపట్టారు. ఆన్‌లైన్ నమోదులోనూ తప్పిదాలకు తావులేకుండా ఉండేలా డేటా ఎంట్రీలో అనుభవం ఉన్న సిబ్బంది సేవలను వినియోగిస్తున్నారు. ఈ ప్రక్రియ రెండు, మూడురోజుల్లో పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించండి

అధికారులకు సూచనలు చేసిన మంత్రి పొంగులేటి



నారాయణపురంలో అమ్మవారికి పూజలు చేస్తున్న మంత్రి పొంగులేటి

కల్లూరురూరల్: స్వగ్రామమైన కల్లూరు మండలంలోని నారాయణపురంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి బుధవారం స్థానికులు వినతిపత్రాలు అందించారు. సాగునీరు, భూసమస్యలు, విద్యుత్, రుణమాఫీ, రహదారుల సమస్యలను విన్నవించగా వాటిని పరిష్కరించాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. కల్లూరు సమీపాన లక్ష్మీపురం సంగారెడ్డి చెరువు సమస్యను ఆయకట్టు రైతులు మంత్రి దృష్టికి తీసుకెళ్లగా, లక్ష్మీపురం రెవెన్యూకు సంబంధించి భూవివాదాలు పరిష్కరించాలని గిరిజనులు కోరారు. భద్రాద్రి జిల్లా కాంగ్రెస్ నాయకులు తుళ్లూరి బ్రహ్మయ్య, చిన్ని కూడా మంత్రిని కలిశారు.

ఆలయాల్లో పూజలు..

కల్లూరు/కల్లూరురూరల్: కల్లూరు ఎన్ఎస్‌పీ క్రాస్ వద్ద శ్రీవీరభద్రస్వామి ఆలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పూజలు చేశారు. అలాగే, నారాయణపురం, కల్లూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యాన జరుగుతున్న దేవీనవరాత్రోత్సవాల పూజల్లో కూడా పాల్గొన్నారు. ఈకార్యక్రమాల్లో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, యాసా వెంకటేశ్వరరావు, మద్దినేని లోకేశ్వరరావు, మార్కెట్ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్‌తో పాటు అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, అంకిరెడ్డి కనకదుర్గ, నగేష్, ఏ.శ్రీనివాసరావు, కాటేపల్లి కిరణ్‌కుమార్, చారుగుండ్ల అచ్యుత్‌రావు, రాచమళ్ల నాగేశ్వరరావు, గుర్రం గోవర్ధన్, మోటమర్రి ప్రభాకర్, పసుమర్తి రాంబాబు, దారా సురేష్ పాల్గొన్నారు.

ఆర్ఎంపీ కుటుంబానికి పరామర్శ..

తల్లాడ: మండలంలోని నారాయణపురానికి చెందిన ఆర్ఎంపీ బొగ్గుల కృష్ణారెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. నాయకులు మువ్వా విజయ్‌బాబు, మట్టా దయానంద్, బొర్రా రాజశేఖర్, వేమిరెడ్డి కృష్ణారెడ్డి, గోపిశెట్టి వెంకటేశ్వర్లు, పొట్టేటి జనార్దన్‌రెడ్డి, గొడుగునూరి లక్ష్మీరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఎర్రి నర్సింహారావు, పైడిపల్లి రవి, గోవింద్ శ్రీనువాసరావు, డి.వీరారెడ్డి, వేమిశెట్టి నాగన్న పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులకు ఎంపిక

పినపాకలో.. ఐదుగురు



ఉపాధ్యాయ పోస్టులు సాధించిన ఐదుగురు యువతీ, యువకులు



తల్లాడలో మల్లయ్యను సన్మానిస్తున్న నాయకులు

తల్లాడ: ఉపాధ్యాయ పోస్టులకు నెలవుగా తల్లాడ మండలం పినపాక గ్రామం నిలిచింది. పట్టుదలతో చదివిన ఐదుగురికి ఉపాధ్యాయ పోస్టులు వరించాయి. ఇటీవల ప్రకటించిన డీఎస్సీలో ఐదుగురు ఉత్తమ ర్యాంకులు సాధించి ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఐదుగురు ఒకే దఫాలో ఉపాధ్యాయులుగా నియమితులవ్వడంతో గ్రామం ఆదర్శంగా నిలిచింది. ఐదుగురు బుధవారం హైదరాబాద్‌లో సీఎం సభలో నియామక పత్రాలు అందుకున్నారు. తాళ్లూరి ముత్తారావు, తాళ్లూరి తనీషా, షేక్ జాన్ పాషా, బాసాటి లక్ష్మీప్రసన్న, ఎన్.షాలిని ఉపాధ్యాయ నియామక పత్రాలు అందుకున్నారు.

స్కూల్ అసిస్టెంట్‌గా మల్లయ్య..

తల్లాడ: ఇటీవల వెలువడిన ఉపాధ్యాయ ఫలితాల్లో తల్లాడ పట్టణంలో నిరుపేద కుటుంబానికి చెందిన ఇజ్జగాని మల్లయ్యకు ఉపాధ్యాయ పోస్టు వరించింది. స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధిచాడు. దీంతో బుధవారం పలువురు అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆపతి వెంకటరామారావు, చల్లా నాగులు, పెరికె కిరణ్, తమ్మిశెట్టి కృష్ణ, గాదె కృష్ణారావు, రాయల రమేష్, చల్లా నరేష్, వి.నాగేశ్వర్‌రావు, సుధాకర్ పాల్గొన్నారు.

ఉద్యోగాలు సాధించిన గాయత్రిరాం, అనూష



గాయత్రిరాం



అనూష

ఏన్కూరు: ఏన్కూరుకు చెందిన వాంకుడోత్ గాయత్రి రాం, బానోత్ అనూషలు ఉపాధ్యాయ పోస్టులు సాధించారు. గాయత్రిరాం ఎలాంటి కోచింగ్ లేకుండా మొదటి ప్రయత్నంలోనే ఉపాధ్యాయురాలిగా ఎంపికై.. స్కూల్ అసిస్టెంట్ (సోషల్‌స్టడిస్) పోస్ట్ సాధించింది. బానోత్ అనూష డీఎస్సీ ఫలితాల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 94 ర్యాంకుతో కొలువు సాధించింది.

వైభవంగా ప్రారంభమైన చండీహోమం



చండీహోమం నిర్వహిస్తున్న భవాని మాలధారులు

సత్తుపల్లిరూరల్: మండలంలోని బుగ్గపాడు శ్రీకనకదుర్గాదేవి అమ్మవారి ఆలయంలో బుధవారం అమ్మవారికి సహస్రనామ కుంకుమపూజలు, చండీహోమం నిర్వహించారు. రెండు రోజుల పాటు చండీహోమం నిర్వహించబడుతుందని ఆలయ నిర్వాహకులు యార్లగడ్డ దయానంద్, సత్యవతిలు తెలిపారు. ఈ చండీహోమ పూజల్లో బుగ్గపాడు, సత్తుపల్లి, నాగుపల్లి చుట్టుపక్కల నుంచి పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. అనంతరం భవాని మాలధారణ భక్తులకు అన్నదానం నిర్వహించారు.

పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కాంతారావు

బోనకల్: మండలంలోని జానికీపురం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న అరికట్ల కాంతారావును పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బుధవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధి కొరకు నిరంతరం పనిచేస్తానన్నారు. తనను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకోవడం పట్ల పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వైవీరావు, ప్రధాన కార్యదర్శి రంగారావు, బ్రహ్మారెడ్డి, కొమ్ము శ్రీనివాసరావు, సీహెచ్ రవికుమార్, రామ్మోహన్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

తల్లాడ అభివృద్ధికి కృషి చేస్తా..



ఫౌంటెన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి, అధికారులు

తల్లాడ: తల్లాడ పంచాయతీ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. తల్లాడ రింగ్ రోడ్డు సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఫౌంటెన్, ఎల్ఈడీతో ఏర్పాటు చేసిన హైమాస్ లైట్లను బుధవారం ఆమె ప్రారంభించారు. అనంతరం తల్లాడ మేజర్ పంచాయతీ సిబ్బందికి యూనిఫాం, ఇన్సూరెన్స్ సౌకర్యంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సెంటర్లో ఫౌంటెన్ ఏర్పాటు చేయడంతో ఆహ్లాదకర వాతావరణం నెలకొందన్నారు. ప్రజలందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ చంద్రమౌళి, ఎంపీఓ కె.శ్రీదేవి, ఎస్సై కొండల్‌రావు, ఈఓ కృష్ణారావు పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యాపారం మరింత వృద్ధి చెందాలి..

కల్లూరు: మండలంలోని గోకవరంలో ఏర్పాటు చేసిన వినాయక ఫైర్ వర్క్‌ను ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి బుధవారం రాత్రి ప్రారంభించారు. రానున్న దీపావళి సందర్భంగా వినాయక ఫైర్ వర్క్స్ వ్యాపారం మరింత వృద్ధి చెందాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ, కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఎస్‌కే యాకూబ్ అలీ, ఏనుగు సత్యంబాబు, పెద్దబోయిన శ్రీనివాసరావు, ఫైర్ వర్క్ నిర్వాహకులు మీరిశెట్టి పవన్‌కుమార్, కట్ల జ్యోతిబసు, ఆర్‌వీకే రాజు, అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



మాట్లాడుతున్న సీహెచ్ఓ వెంకటేశ్వర్లు

మధిర: మానసిక ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపించాలని సీహెచ్ఓ వడ్లమూడి వెంకటేశ్వర్లు అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినం సందర్భంగా పట్టణంలోని ఎస్సీ కాలనీలో ఉన్న పల్లె దవాఖానా 5వ అంగన్‌వాడీ కేంద్రంలో మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దెందుకూరు పీహెచ్‌సీ వైద్యుడు పృథ్వీరాజ్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వత్తిడితగ్గించుకోవాలన్నారు. కోపం, ఆవేశ పూరితమైన విషయాలపై ఓర్పు కలిగి ఉండాలని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన టెలీ మానస్ 14416 కార్యక్రమం ద్వారా ప్రత్యేక మానసిక వైద్య నిపుణులు అవసరమైనవారికి ప్రత్యేక సలహాలు వైద్య సూచనలు ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో పల్లె దవఖానా వైద్యురాలు జాహ్నవి, ఆరోగ్య పరివేక్షకుడు లంకా కొండయ్య, ఐసిడిఎస్ సూపర్ వైజర్ జ్యోతి, ఎఎన్ఎమ్ వంగూరి విజయకుమారి, అంగన్‌వాడీ టీచర్స్ రాణి, వెంకటకుమారి ఆశా కార్యకర్తలు సమీప, ప్రశాంతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బతుకమ్మ వేడుకలు..



సత్తుపల్లి కోర్టులో వేడుకల్లో పాల్గొన్న 6వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్, సబ్‌జడ్జి మీరాఖాసీంసాహెబ్



సత్తుపల్లిటౌన్: బైపాస్‌రోడ్‌లో బతుకమ్మ ఆడుతున్న మంత్రి పొంగులేటి సతీమణి మాధురి, తదితరులు



ఎర్రుపాలెం: బనిగండ్లపాడులో విజేతలకు బహుమతులు అందజేస్తున్న సూపర్‌వైజర్ సరిత



ముదిగొండ: బతుకమ్మ ఆడుతున్న వైద్య సిబ్బంది

సత్తుపల్లిటౌన్/సత్తుపల్లిరూరల్: బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయయ్యలో.. అంటూ బతుమ్మ సంబురాలను బుధవారం సత్తుపల్లి బైపాస్‌రోడ్డులో, సత్తుపల్లి కోర్టులో ఘనంగా నిర్వహించారు. మహిళలు రంగురంగుల పూలను పేర్చి బతుకమ్మ ఆడారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో..

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు, మామునూరు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళలు, సిబ్బంది బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం కిషోర బాలబాలికలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. చిన్నారులకు 1098 మరియు 181 హెల్ప్ లైన్స్ నంబర్లపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరిత అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సరిత, అంగన్‌వాడీ టీచర్లు మహాలక్ష్మి, జ్యోతి, మేరీ, ఉమామహేశ్వరి, ఆశా కార్యకర్తలు సుధారాణి, ధనలక్ష్మి, సుజాత, తదితరులున్నారు.

ముదిగొండ పీహెచ్‌సీలో..

ముదిగొండ: ముదిగొండ పీహెచ్‌సీలో బతుకమ్మ సంబరాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ అరుణాదేవి, సీహెచ్ఓ మధుసూదన్‌రావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కారేపల్లిలో సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు



ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

కారేపల్లి: నేడు కన్నుల పండుగగా.. ఆడపడుచుల కోలాహాలాల నడుమ, ఆటపాటలతో సందడి చేసేందుకు 'సద్దుల బతుకమ్మ'కు కారేపల్లి పెద్ద చెరువు ఒడ్డు సిద్ధమైంది. సింగరేణి (కారేపల్లి) గ్రామ పంచాయతీ సిబ్బంది కారేపల్లిలోని పెద్దచెరువు ఒడ్డు వద్ద పరిసరాలను పరిశుభ్రం చేసి, విద్యుదీకరణ పనులను బుధవారం చేపట్టారు. అదే విధంగా.. గ్రామం నుంచి బతుకమ్మలతో ర్యాలీగా సుమారు అరకిలోమీటరు దూరంలో ఉన్న చెరువు ఒడ్డు వద్దకు మహిళలు చేరుకునేందుకు రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ లైట్లు ఏర్పాట్లు చేశారు.

గ్రామాల్లో శ్రీదుర్గామాత ఉత్సవాలు



మధిర: ఆజాద్‌రోడ్డులో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో..



చింతకాని: నాగులవంచలో..



సత్తుపల్లిరూరల్: శ్రీసరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు



కొణిజర్ల: గంగపాలెంలో..

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల, గంగాలంపాడు, పల్లిపాడు గ్రామాల్లో అమ్మవారు సరస్వతీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పలుగ్రామాల్లో సామూహిక అక్షరాభ్యాసాలు, చిన్నారులచే సరస్వతీ పూజలు నిర్వహించారు. కొణిజర్ల గాంధీ బజార్ సెంటర్‌లో గణేష్ యూత్ ఆధ్వర్యంలో బుధవారం అన్నదానం నిర్వహించారు. మాజీ సర్పంచ్ రామారావు, శివాలయం ప్రధాన పూజారి శ్రీకాంత్ ఆచారి ముఖ్య అతిధులుగా హాజరై పూజలు నిర్వహించి అన్నదానం ప్రారంభించారు.

ఘనంగా సామూహిక అక్షర్యాభ్యాసాలు..

ఏన్కూరు: దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక కొదండ రామాలయంలో, రాజరాజేశ్వరి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కనకదుర్గమ్మ సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. దేవిశెట్టి ఆద్య చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు ఉచితంగా అందించారు.

శ్రీసరస్వతీదేవిగా అమ్మవారు

సత్తుపల్లిటౌన్/సత్తుపల్లిరూరల్: శ్రీదేవీనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం బుగ్గపాడు శ్రీకనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు శ్రీసరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

తక్కెళ్లపాడులో..

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడులో శ్రీలలితా రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలోని అమ్మవారు సరస్వతీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బనిగండ్లపాడులోని శ్రీవిజయ కోదండ రామస్వామి ఆలయంలో అర్చకుడు వేదాంతం రాధాకృష్ణమాచార్యులు.. చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. బాల బాలికలకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు తహసీల్దార్ ఉషాశారద చేతుల మీదుగా అందజేశారు.

దుర్గాదేవికి పూజలు..

చింతకాని: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు అమ్మవారు శ్రీ సరస్వతీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమివ్వగా భక్తులు పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



ఏన్కూరు: చిన్నారులకు అక్షరాభ్యాసం..



సత్తుపల్లిటౌన్: సరస్వతీ ఆలయంలో సామూహిక అక్షరాభ్యాస పూజల్లో పాల్గొన్న భక్తులు



వైరారూరల్: పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



ఎర్రుపాలెం: బనిగండ్లపాడులో బాలికకు బహుమతి అందిస్తున్న తహసీల్దార్ ఉషాశారద